కథానిక

# శాసనోల్లంఘనం

బి. ఎస్. ఆర్. కృష్ణారావు

ఎందుకనో నా కారోజున చాలా చిరాగ్గా వుంది. రాత్రి సరిగ్గా నిద్రపోయినా మామూలుగా అన్నంతిన్నా, ఎందుకనో మనస్సు సరిగ్గా లేదు. దానికి తగ్గట్లుగా ఆఫీసుకుపోగానే నా బల్లమీద ఒక టెలిగ్రాం వున్నది. గుండెలు జారినాయి. ఏ 'యాటంబాంబో' పైనుంచి పేలినంత పనయింది. మెల్లిగా అటెండెన్సులో సంతకం చేసి పిల్లల్లే కుర్చీలో కూర్చుని నెమ్మదిగా డ్రాయరు తీసి కలం సిరాబుడ్డి పైన బెట్టి మనస్సులో పది తడవలు రామ జపం చేసుకుని పదకొండు'ఠంగ్ ఠంగ్' మని కొడుతూ వుంటే ఆ పదకొండు గంటలే నా ప్రాణానికి "గార్డాఫ్ ఆనర్" ఇచ్చి పదకొండు ఫిరంగులు ప్రయోగించినట్లుగా భావించుకుని మెల్లిగా ఆ టెలిగ్రాం తీసి చదివాను. ఎవరికన్నా జబ్బుగా వున్నప్పుడు ఇచ్చే టెలిగ్రాంలో "చాలా సీరియస్‌గా వుంది బయల్దేరి రావాలి" అన్నట్లుగా "బడ్జెట్లు అర్జంటుగా పంపాలి" అని వుంది. గత రెండుమూడు రోజుల నుంచీ ఆ విషయమైన కాయితాలతోనే సతమతవుతూ వున్నా ఇంకా తెమల్లేదు. ఇంతలోకి మా సెక్షన్ హెడ్‌గారు కూడా వచ్చి "చూశావా గోపాలం! టెలిగ్రాంవచ్చింది, మరి బడ్జెటు ఏంచేశావ్?" అన్నాడు. 'అదేనండీ చూస్తున్నాను ఆ ప్రయత్నంమీదనే వున్నా"నని సమాధానం చెప్పింతరువాత ఆయన మళ్ళీ ఒకసారి హెచ్చరించి వెళ్ళిపోయాడు, తన పని అయిపోయినట్లుగా భావించుకుని. ఆ రోజల్లా ఆఫీసులోనే కొంతవరకూ పూర్తిచేసి మిగిలిన దానికి కావలసిన గ్రంథమంతా సేకరించుకుని చంకన బెట్టుకుని ఇంటికి ప్రయాణమైనాను, దార్లో ఆఖరి బేడా పెట్టి హోటల్లో అరకప్పు కాఫీ తాగి.

గుమ్మంలో కాలుపెట్టగానే సీత ఎదురై "ఇవాళ ఓ వంద పిడకలు వేయించుకున్నాను. పెట్లో పర్సులో చిల్లరడబ్బు లేమయినా వున్నయ్యేమో ననుకుంటే పర్సు ఖాళీగా వుంది. వాళ్ళ కామాక్షమ్మగారి దగ్గర పావలార్థణా తీసుకుని పిడకలమ్మికి ఇచ్చాను. ఆవిడ చామంతి పూలు కొనుక్కుంటుందిట. డబ్బు లియ్యండి ఇచ్చొస్తా" అంది. పగలల్లా చాకిరీ చేసిచేసి చేసింది చాలక కట్ట చంకన బెట్టుకుని ఇంటికొస్తే అయ్యో పాపం ఈ సంసారం కోసం ఒక్క మనిషి ఎంత తాపత్రయపడి సతమతమవుతున్నాడని జాలిదలచి ఎదురుకుండా వచ్చి ఆ కాయితాలకట్ట తీసుకుని ఇంట్లోపెట్టి కాసిని చల్లని మంచినీళ్ళిచ్చి కోటు తీసుకుని చిలక్కొయ్యకు తగిలించి "ఏమండీ వంట్లో కులాసాగావుందా ఇవాళ మన చిన్నవాడు చిలకపలుకుల్లా చిన్న చిన్న మాటలు నేర్చుకున్నాడు" అని ఏవేవో కులాసాకబుర్లు చెప్పి శ్రమనంతా పోగొట్టేది పోగా, ఇనపగజ్జల తల్లిలా గుమ్మానికి ఎదురొచ్చి కాబూలీవాడి మాదిరి బాకీవున్నట్లుగా ముఖం పెట్టి "వందపిడక లేయించుకున్నాను పావలార్థణా కావాలి" అనేసరికి నాకూ అరికాలిమంట నెత్తికెక్కి బుఱ్ఱ వేడెక్కి జేబులో డబ్బులు లేకపోవటంచేతనో, ఉన్న బేడా పెట్టి మధ్యాన్నం కాఫీ తాగితే సాయంత్రం ఎట్లాగని ఆలోచించి అయినా ఎండలోపోలేక బద్ధకించి తాగిన రెండుగ్లాసుల మంచినీళ్లూ చమట రూపంగా మారి వళ్లంతా చెమటపట్టి ముఖం మీద ముత్యాలా మెరవసాగింది. చమట బిందువులు తుడుచుకుంటూ—

"నెలాఖరు రోజని తెల్సుకదా, నిన్ను పిడకలెవరు వేయించుకోమన్నారు సీతా!" అన్నాను కోపంగానే.

"బాగుంది మీరనేది. కిర్సనాలు పెట్టి రాజేస్తేనేమో ఉన్న కిర్సనాలంతా నువ్వు పొయ్యి రాజెయ్యటానికే సరిపోతున్న దంటిరి. ఏ కాయి

తాలతోనో రాజేసి ఎట్లాగో పిడకలో నిప్పు చేద్దామని పిడక లేయించుకుంటే నేమో ఇట్లా అంటిరి. మరి ఎట్లా నిప్పు రాజెయ్యాలో నాకు తెలీటం లేదు. కాళ్లూ చేతులూ పెట్టి రాజెయ్యాలా మరి?" అంది.

"ఆ. కాళ్లూ చేతులూ పెట్టి రాజెయ్యాల్సిందే. మరి సంసార మనుకుంటే ఏమనుకున్నావ్" అన్నా కోపంగా. సీత మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. కాయితాలు అలమారాలో పెట్టి స్నానంచేసి మళ్లీ కాయితాలు ముందేసుకుని కూర్చున్నాను, ఆఫీసు పని ఇంటిదగ్గర ప్రారంభిద్దామని.

"ఎందుకండీ నామీద అంత విసుగు. నేనేం పాపంచేశానని చెప్పండి. పిడకలు లేకుండా సంసారం ఎట్లా వెళుతుంది" అన్నది కొంచం జాలిగా సీత.

"పిడకలు ఎందుకొన్నావనికాదు సీతా నే చెప్పేది. డబ్బు లేని నెలాఖరు రోజుల్లో ఎందుకొన్నావని అన్నా. అంతే. సంసారం అన్న తరవాత ఏది లేకపోయినా కష్టమే. అందుకనే సంసారి దుఃఖి సన్యాసి సుఖి అన్నారు పెద్దలు. ఎప్పుడో ఈ జంధ్యాలు చిలక్కొయ్యకు తగిలించి నేనూ ఒక చిలుంగొట్టాం కొన్నానంటే నారోజులు దివ్యంగా వెళ్ళిపోతయ్యి" అన్నాను ఫైలు పేజీలు తిరిగేస్తూ సీతవైపు చూడకుండా.

"అయ్యో రామ. ఈ బెదిరింపులకు భడిసే దాన్ని కాదండోయ్. మా నాన్న కూడా ఇట్లాగే కాలంనాడు విసుక్కుని విసుక్కుని ఒకసారి జంధ్యాలు తెంచేస్తున్నానని కూడా మెళ్లోనుంచి తీశాడు. ఆయన నిజంగా తెంచొచ్చాడని ఎవరూ మా అమ్మతో సహా మాట్లాడకపోయేసరికి ఆయన మళ్లీ జంధ్యాలు మామూలుగానే వేసుకుని ఊరుకున్నాడు. ఆ తరవాత ఇరవై ఏళ్లు కాపరమూ చేశాడు, ఆయిదారుగురు పిల్లల్నీ కన్నాడు. అట్లాగే మీరూను" అంది నవ్వుతూ. ఈ మాటతో నన్ను చాలా చిన్నతనం చేసినట్లయింది. కానీ చూద్దాం దీని ధీమా ఏమిటో, వాళ్ల నాన్నమాదిరే నన్ను పోల్చింది. ఒకసారి నా తఢాకా చూపిస్తేనేగాని ఇంక అట్లా తేలిగ్గా మాట్లాడదని మనస్సులో అనుకుని ఆ పని బడ్జెటు పోయింతరువాత చేద్దామని నిశ్చయించుకుని—

"సరే ఈ మాటలకేంగాని కొంచంసేపు వూరుకో మాట్లాడకుండా. టెలిగ్రాం కూడా వచ్చింది" అన్నాను.

"టెలిగ్రామా? ఎక్కడ్నుంచీ? మొన్న నేగా మనవాళ్లదగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. రాధాలుకి పథ్యం పెట్టామనీ కొంచం కులాసాగానే వుందనీ వుత్తరంలో కూడా రాశారుగా! అప్పుడే మళ్లీ ఏంకొంపలు మునిగినయ్యో. ఏముంది టెలిగ్రాంలో?" అంది ఆదుర్దాగా. నాకు పొట్టచెక్కలయ్యేటంత నవ్వొచ్చింది. కానిఅంతాఆపుకుని,

"ఏమీ లేదు. మీ నాన్న నిన్ను అర్జంటుగా పంపమని టెలిగ్రాం ఇచ్చాడు. రాత్రి మెయిలుకు బయల్దేరాలి సుమా" అన్నాను.

"అయితే ఫలానందుకని రాయలా టెలిగ్రాంలో? బహుశా రాధాలుకి ఎక్కువచేసి ఉండొచ్చు. అయినా ఈ ఇంగ్లీషు మందులతో నయమవదని నేను వెనక వెళ్లినప్పుడే మొత్తుకున్నాను. ఏదయినా తెలుగుమందు ఇప్పించమని చెబితే నామాట వింటేగా. మిన్నొచ్చి మీద పడేటంత వరకూ ఈ పాడు రంగునీళ్ల మందులు వాడతారు. ఆఖరికి ఆయుర్వేద వైద్యులూ, మూలికలూ కావాల్సొస్తుంది. అయితే ఇందాకటినుంచీ ఈమాటలన్నీ చెబుతూ ఆ కాయితాలు ముందేసుకుని కూర్చున్నా రెందుకూ పాడు కాయితాలు. భోజనానికి లేవండయితే" అన్నది చాలా ఆదుర్దా పడుతూ.

"అదుగో ఆ పాడుమాటలే అనవద్దనేది. పాడుకాయితా లేమిటి? ఆ పాడుకాయితాలే చాలీచాలని జీతాలిచ్చినా, టెలిగ్రామ లిచ్చినా! తెల్సిందా?" కొంచెం కోపంతో.

"కాయితాలు టెలిగ్రాంలు ఇవ్వట మేమిటి, మరీ నన్ను పిచ్చిమొద్దుని చేస్తునారే. చాలీ చాలని జీతాలన్నారు అది బాగానేవుంది. మరి టెలిగ్రాంలు ఇవ్వటమేమిటి" అంది కాస్త ఆదుర్దాను తగ్గించి కన్నార్పకుండా నావైపు చూస్తూ.

"పిచ్చిదానా! రాధాలూ లేదు, టెలిగ్రామూ లేదు. బడ్జెటు పంపించమని పైనుంచి టెలిగ్రాం వచ్చింది. అంతేగాని ఎవరికీ ప్రాణంమీదికి రాలేదు. తెలిసిందా?' అన్నాను నవ్వి.

"నా తలకాయల్లేవుంది సౌభాగ్యం. ఆఫీసు కాయితాలకి టెలిగ్రాం ఇవ్వట మేమిటి, మతి లేకపోతేసరి. ఎవరికో ప్రాణం మీదికొచ్చినట్లుగా టెలిగ్రాంలు కూడా ఎందుకు డబ్బు దండుగ. ఇవాళ కాకపోతే రేపొస్తయ్యి. రేపు కాకపోతే ఎల్లుండి. ఈ భాగ్యానికి తోడు టెలిగ్రాంలు కూడానూ! హడిలి గుండె పగిలి చచ్చేటట్లుగా" అంది ఇందాకటి ఆదుర్దా నంతనీ వదిలించుకుని.

నేను మాట్లాడకుండా వుంటేనన్నా తనూ ఊరుకుంటుందేమోనని నేను మరీ మాట్లాడకుండా కూర్చున్నా.

"ఇది సరేగాని చే చెప్పిన మాట మర్చిపోయినారల్లే వుందే చూస్తే! ఎన్నాళ్లో లేదు ఇక వారం రోజులేవుంది జ్ఞాపకం వుందా, అది లేదా?" అంది ఫైలు చేత్తో లాగుతూ. ఎట్లాగో నన్ని పని చేసుకోనిచ్చేటట్లుగా లేదని ఫైలు మూసి

"ఆదేమిటి" అన్నాను.

"అదే అబ్బాయి ముద్ద కుడుముల సంగతి. ఓ వీశెడు లడ్లూ ఓ వీశెడు చిలకలూ దానికితగ్గ చలిమిడి చేస్తే చాలు ఎక్కేతక్కేను. లడ్లు ఇంట్లో అన్నీ తెస్తానంటే కదతా లేక చిలకలతో పాటుగా బజార్నించి తెస్తే సరే సరి ఏ చిక్కూ లేకుండా పోతుంది. చలిమి డొక్కటే ఇంట్లో చెయ్యొచ్చు" అంది నాభుజంపట్టుకుని ఊపుతూ.

"గవర్నరుగారి టూరు ప్రోగ్రాంకన్న చాలా విశదంగా, బాగా అందరికీ తెల్సేటట్లు వుంది నీ ముద్ద కుడుముల ప్రోగ్రాం. ఓ యూపాయో రూపాయలెవరయినా యిస్తారేమో కనుక్కో మీవాళ్లు."

"అదుగో ఆమాటే అనొద్దనేది. మాట్లాడితే మావాళ్ళమీదికి ఒంటికాలుమీద లేస్తారు. పెళ్లినాడు నగలకింద ఇచ్చిన నాలుగొందలూ పులుసులో వేశారు కదా. నోర్లేనిదాన్ని చేసి నన్ను ఆడించింది కాకుండా వాళ్ళనికూడా ఆడించాలనుకుంటే ఇంకా ఎందాకా అని ఇస్తారు? మళ్ళీ మటుకు ఇద్దరు బిడ్డలు పుట్టింతరువాతకూడా." అంది ఈసడింపుగా.

"అబ్బే మహా ఇచ్చారులే మీవాళ్ళు. వాళ్ళమీద ఈగయినా వాలనియ్యని ముద్దు కూతురుని బయల్దేకావు మహా లావునాన్న నీకే వున్నాడు ఎవరికి లేనట్లుగా" అన్నా కోపంగా.

"సరే, వాళ్ళ సంగతి మనకెందుకుగాని ముందు ముద్ద కుడుముల సంగతి చెప్పండి."

"సరే ఆలోచిద్దాంలే. ముందు బడ్జెటుపోనీ తరువాత ముద్ద కుడుముల సంగతి చూద్దాం. గవర్నమెంటు లెక్కలు ముందా నీ ముద్ద కుడుములూ, చిలకలూ, జంతికలూ ముందా." అని దోరణి మార్పించే వుద్దేశంతో మళ్ళీ ఫైలుతీసి పాత బడ్జెట్లు చూస్తున్నాను.

"సరే భోంచేసి ఏకంగా కూర్చోండి మళ్ళీ కూర్చుంటే పొద్దు పోయిందాకా లేవరు" అని వడ్డించటానికి వెళ్ళిపోయింది వంటింట్లోకి. అప్పటికి బ్రతుకు జీవుడా అనుకుని భోజనానికి వెళ్ళాను.

"అయితే ముద్దకుడుములు ఇప్పించ రన్నమాట" అన్నది మళ్ళీ నిశ్చయంగా తేల్చుకుందామని.

"సరేమిరా వీల్లేదు. ఇవాళ ముద్ద కుడుములంటావ్, రేపు పలుకుబ్బకి చిలక లంటావ్, ఎల్లుండి అడుగులకి అంశ లంటావ్ ఇంకా నాలుగురోజులు పోతే అక్షరభ్యాస మంటావ్ నీదేం పోయింది ఎన్నయినా చేయించగలవు. డబ్బిచ్చే నాథుడే కనబడలేదు" అన్నా నేను నిశ్చయంగానే.

"పోనీ, ఈకర్చుతప్పించుకున్నందువల్ల నాలుగెకరాల పొలం కొంటారా. పెద్ద మేడ కడతారా అచ్చటా ముచ్చటా తీర్చుకోవాలిగాని. ఓ యూపాయో రూపాయి లయితేనాలు నాకో చీరా వాడికో పట్టు చొక్కాతో కదా" అంది కాస్త జాలిగా ప్రాధేయ పూర్వకంగా.

"నువ్వు బ్రతిమాలినా, భామకలాపం ఆడినా కాదంటే కాదు అంతే. ప్రభుత్వాలు బడ్జెట్లలోనే చాలా లోటొచ్చి కర్చుకు తట్టుకోలేక చాల మటుకు కర్చు తగ్గించుకొందుకు ప్రయత్నం చేసి విఫలు లవుతున్నారు. అటువంటిది మనబోటి వాళ్ళు ఎంత తగ్గించుకోవాలో ఆలోచించుకో. ఇంకా గట్టిగా మాట్లాడితే జీతాలుకూడా తగ్గిస్తారేమోనని భయపడుతున్నాం."

"అంత పెద్ద ప్రభుత్వమే కర్చుతో తట్టుకోలేకపోతూంటే మనబోటివాళ్ళం ఒక లెక్కేమిటి

ఇనిమీరేగా ఇప్పుడన్నది. కాబట్టి అదే కర్చుల్లో అదొకటి. అయినా మీదంతా చోద్యంగాని గుమ్మడికాయలు పోసే కంత పుటిక్కిన జార విడిచి కాలుపోయేకంత కటిక్కిన పట్టుకుంటారు. మీ మగవాళ్ళ లక్షణమే అది. కృష్ణస్నానానికి వెళ్ళి గుళ్ళో కూర్చునే బ్రాహ్మడి దక్షిణకి ఓ అణా కర్చుపెడితే ఇల్లు గుల్ల చేస్తున్నావ్ ఎక్కడిలేని కర్చుతోనూ అంటారు. మీకు మటుకు మూడు పూటలూ మూడు కిళ్ళీలూ వేసుకుని పెట్టెడు సిగిరెట్లూ కాల్చొచ్చు. ఆ మాటంటే సంపాయించే మగవాడ్ని నా ఇష్టం అంటారు. మా నాన్న చాకలిపద్దు చదువులతో మా అప్పచెల్లెళ్ళని వదిలిపెట్టేడు గాని మేము చదువుకుంటే ఇంతకన్న ఎక్కువగానే సంపాయిద్దుము. మహాలావు మీరే ఉద్యోగం చేస్తున్నా రనుకొంటున్నారేమో" అన్నది ఈసడింపుగా. ఈ మాటకు నాకూ ఛర్రుమన్నది. నా కిళ్ళీల సంగతీ, సిగిరెట్ల సంగతి విమర్శించటమే గాకుండా నా ఉద్యోగం విషయమైకూడా చులకనగా మాట్లాట్టంనుంచి ఏమయినా చనువిస్తే ఆడవాళ్ళు నెత్తినెక్కుతారనుకునీ, నాపట్టు వదలకూడదని అనుకుని—

"నువ్వు వెయ్యిచెప్పు లక్ష చెప్పు సీతా. ముద్దకుడుములకి ఒక దమ్మిడికూడా కర్చు పెట్టేది లేదుకదా చేసిన చలిమిడిలో ఒక్క పిసరుకూడా నోట్లోవేసుకోను. అసలు నీ యిష్టం అసలింతకీ వాడిపేరుచెప్పి నువ్వు కుర్చీలో కూర్చుందా మనుకున్నావ్ కాబోలు కొత్త చీర కట్టుకుని! నాదగ్గర ఆ పప్పు లుడకవు. జాగ్రత్త. ఇదే ఆఖరిసారిగా చెబుతున్నా ఇప్పటికే సంసారం మైనస్ ఎక్స్పెండిచర్‌లో వుంది" అని భోజనం పూర్తిచేసి చెయ్యి కడుక్కుని ఇంక మాట్లాడకుండా ఫైలుతీసి కూర్చున్నాను.

ఒక్కొక్కప్పుడు అమాయికంగా ఏమీ తెలీకపోయినా సీతకు సమయానికి ఎక్కడలేని తెలివితేటలు పుట్టుకొస్తయ్యని నాకు తెలుసు. నేనింత గట్టిగా కాదనిచెప్పినా ఎట్లాగయినా సరే ముద్దకుడుములు ఇప్పించి తన పంతం చెల్లించుకుంటుందనీ, నామాట పూరికే పోతుందనీ నాకు గట్టిగా తెలుసు. అయినాకానీ చూద్దామని ఊరుకున్నా.

మామూలు పరిస్థితుల్లో అయితే సీత పట్టుదలగా ఏం చేస్తున్నదో ఓ కంటిని పెడుతునే వుండేవాణ్ణి గాని నాకీ బడ్జెట్టుతో క్షణం తీరిక లేకుండా వుంది. ఉదయం ఏడు గంటలకల్లా ఆఫీసుకు వెళితే మధ్యాహ్నం పన్నెండింటికి భోజనానికి రావటం, మళ్ళీ ఆ నాలుగు మెతుకులూ నోటగొట్టుకుని వెళితే రాత్రి ఏడెనిమిదింటికి రావటంగా వుంది. అసలే ఆఫీసు పని ఎక్కువ, అందులో ఈ బడ్జెట్లువద్దనుంచి ఇంకా తీరకపోవడంనుండి ఇంటిసంగతి పట్టించుకోటానికి వీల్లేక పోయింది. అందుకని ఇంట్లో ఏం జరుగుతున్నదో నా చెవిని బట్టటంలేదు. నాకు కలిగిన సంతోషమల్లా సీత ముద్ద కుడుముల సంగతిగాని, వాటికి కావలసిన సరంజామా సంగతిగాని ఎత్తుకోలేదు. ఏవిధంగానైనాసరే డబ్బు కర్చుకాకుండా వుంటేనే సాధ్యమైనంతవరకూ మగవాళ్ళ పద్ధతి అందుతో తక్కిన జీతగాళ్ళ పద్ధతీ అవటంచేత ఈ తడవ తప్పిపోయిందని నేను చాలా సంతోషించాను. సీతకు నిజంగా నా మాటలు నచ్చటంనుంచే ఆమాట ఎత్తకండా వుందని సంతోషించి నాయం దామెకుగల అవ్యాజానురాగానికి చాలా మనస్సులో ఆమెను అభినందించాను.

ముద్దకుడుములు ఇప్పించవలసిన రోజులు దగ్గర కొస్తున్నయి. ఇంక గట్టిగా మూడురోజుల వ్యవధిమాత్రమే వుంది. ఇంట్లో ఆ ప్రయత్నాలేమో జరగటం లేదు.

తక్కిన చుట్టాల విషయంలో ఎట్లావున్నా మా పెద్ద వదినగారుమాత్రం వచ్చే ముందు ఒకరోజు ముందుగా ఉత్తరం రాయటం అలవాటు ఇల్లు తెల్సున్నదే అయినప్పటికీ ఎందుకయినా మంచిదని స్టేషనుకు రమ్మనమని రాసేది. ఉత్తరం చేరగానే స్టేషనుకు వెళ్ళి ఆవిడను ఇంటికి తీసుకొస్తూ వుండేవాడిని. ఈ తఫా ఎందుకనో ఉత్తరం లేకుండానే తలవని తలంపుగా వచ్చింది. అసలీమధ్యనే ఆవిడ వచ్చి వెళ్ళింది. రెండునెల్లుకూడా కాలేదు: మళ్ళీ ఇంత తొందరలో ఎందుకొచ్చిందో నాకు అర్థం కాలేదు. అయినా వచ్చినమనిషిని ఎందుకొచ్చావని అడగం కాబట్టి మామూలుగానే కుశలప్రశ్నలువేసి వుండమని నా దోవని నేను

ఆఫీసుకు వెళ్ళిపోయారు. ఇదివరలో ఒకసారి ఇట్లాగే ఆవకాయ తిననని, అసలు ఇంట్లో ఆవకాయ పెట్టవద్దనీ, శపథంచేసిన ఏడుకూడా ఇట్లాగే ఆవిడవచ్చి ఆవకాయపెట్టి, నా ఎదటనే అప్పాచెల్లెలూ ఇద్దరూ కొత్తావకాయ వేసుకుని తింటూ నాకు ఉప్పావకాయవేసి నోరు చవిచచ్చిపోయి ఆవకాయమీద ఆశ కలిగిన తరువాత నాచేత అడిగించి తినిపించిన సంగతి గుర్తొచ్చి, మళ్లీ ఈ అప్పచెల్లెళ్ళిద్దరూ ఏదో గూడుపుఠాణీ చేస్తారు కామాలురా భగవంతుడా అని ఎక్కడ నాచేత చిలకలూ, లడ్డూలూ తెప్పిస్తారోననీ, ఇంట్లో డబ్బుపెడితే అది వాడుకుంటారేమోననీ జాగ్రత్తగా వున్నాను చాలా.

ఆరోజొచ్చింది. మామూలుగా ఉదయం ఏడుగంటలకు వెళ్లి మధ్యాహ్నం పన్నెండు గంటకి భోజనంచేసి తిరిగి ఆఫీసుకు వెళ్లాను. అంతవరకూ ఇంట్లో ఈ ప్రమేయం మాట్లాడుకోటంగాని వాటి ప్రయత్నం చెయ్యటంగాని లేదు. నిజంగా మానుకున్నారు కాబోలని సంతోషించాను.

ఆ రోజుతో బడ్జెట్టు పనికూడా పూర్తయిపోవటంనుంచి ఏడుగంటలకల్లా ఇంటికి బయల్దేరి వస్తున్నాను. మా ఇంటిసందు తిరిగేసరికి శనగ్గింజలు తింటూ మా గుమ్మంలోనుంచి పేరంటాళ్లు వస్తున్నారు. కొంపతీశారు ఇంకేముంది! నాకు తెలీకుండా ముద్దకుడుములు ఇప్పించేశారు కామాలు, ఆ అప్పచెల్లెళ్లిద్దరూ కూడబలుక్కుని ఏపనయినా చేస్తేరామలక్ష్మణుల్లాపక్కమాటమీదుంటారని అనుకుని యకాయకిన ఆదుర్దాగా యింట్లోకొచ్చేశాను అప్పటికిముత్తయిదువలంతా వెళ్ళిపోయారు: లోపల వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటున్నారు. ఏమిటినని గోడపక్కగా నిల్చుని విన్నాను. మా వదినగారు అంటున్నది.

“ఏమిటో ఈ కాలం మగవాళ్లు నా అంత తెలివికలవాళ్ళు లేరనీ, నేనే కర్చులు చాలా తగ్గిస్తున్నాననీ, నే చెప్పినట్లుగా ఇంట్లో అంతా నామాట వింటున్నారనీ అనుకుంటారు. ఆడవాళ్లు చేసేపన్లు వాళ్ళకు తెలియవు. ఉదాహరణకి ఇవాళ ఇంట్లో ఈపని జరుగుతుందని ఆయన ఏమాత్రం గ్రహించలేక పోయాడు కదా సీతా” అన్నది.

“అవునక్కయ్యా. మీ మరిది అంతే ఏదో ఆలా చేద్దామని అనుకుంటాడు. వారెంత గిజిపట్టుగా వుంటారో దానికి రెట్టింపుకర్చు అవుతుంది. అయింతరువాతగాని వారికి తెల్సిరాదు” అన్నది సీత.

ఇద్దరూ కలసి కొంప ముంచారనుకుని లోపలికి వెళ్ళాను. నన్ను చూడగానే మాటలు ఆపేసి ఇద్దరూ చెరో పక్కగా వంటింటి గుమ్మాని కానుకుని నిల్చున్నారు. ముత్తయిదువలకోసం వేసిన చాపలూ, చాపలమీద శనగ్గింజ తొక్కలూ, అరటిపళ్ల తొక్కలూ, చాపలకి పసుపూ వున్నాయి. దాన్నిబట్టి వాళ్ళ చాలకాన్నిబట్టీ అక్షరాలా చేశారని అనుకుని కోపమొచ్చి మాట్లాడకుండా చొక్కా విప్పి మామూలుగా పడక్కుర్చీలో పడుకున్నాను. పదినిమిషాలు గడిచింతరువాత ఒక పళ్లెంలో ఇన్ని శనగలూ, రెండులడ్డూ, రెండు చిలకలూ, రెండు చలిమిడి ఉండలూ రెండు అరటిపళ్లు పెట్టి పట్టుకొచ్చి మాట్లాడకుండా నావళ్లో పెట్టిపోయింది సీత. అవన్నీ చూడగానే చాలా పెద్ద తతంగమే జరిగిందే దీనికి డబ్బు ఎక్కడిదా అనుకున్నాను. కానీ తొందరపట్ట మెందుకు వాళ్ళంతట వాళ్లే చెబుతారని వూరుకున్నాను. ఆ పళ్ళెంలో వేమీ తీసుకోకుండానే కింద పెట్టేశాను. మెల్లిగా పిల్లాడి నెత్తుకుని సీత వచ్చి నా ఎదురుగా నిల్చుంది.

“ఇవాళ అబ్బాయిచేత ముద్దగుడుములు ఇప్పించాము” అన్నది మెల్లిగా నవ్వుతూ.

“మంచిపని చేశారు. ఇంక సంసారాలు బాగుపడమంటే ఎట్లా బాగుపడతయి? ఎందుకీ తతంగమంతా? ఓపక్కని జీతాలుచాలక, ఐదువేళ్లల్లో చిటికెన వేలుకూడా నోట్లోకిపోని ఈ కరువురోజుల్లో ఎందుకీ తతంగమంతా” అన్నాను కోపంగా.

“మీడబ్బు కర్చుపెట్టలేదుగా!” అంది.

“ఎవరి డబ్బయితే మటుకు ఎందుకు కర్చుపెట్టాలి? అయినా మన డబ్బుకాక మన పిల్లాడి ముచ్చట్లకెవరుకోట్లు కర్చుపెడతారా ఏమిటి? అన్నీ దొంగవేషాలూ దొంగకథలూనూ, నాకు తెలీకుండా డబ్బెక్కడో యిప్పుడో కాస్తా అప్పుడో కాస్తా దాచుకుంటావ్. అదిప్పుడు బయటి

కొచ్చింది. ఇంత దొంగబుద్ధి కలదానివని కల్లో నయినా అనుకోలేదు." అన్నా కోపంతో గట్టిగా. సీత ఈమాటకు గుడ్ల నీళ్ల గుక్కుకుని వెళ్లింది అప్పగారి దగ్గరికి.

"దాందేమీ తప్పులేదు గోపాలం! తప్పంతా నాదే. పిల్లాడిచేత ముద్దుగుడుము లిప్పించాలని వుంది, ఏం చెయ్యటానికీ ఈ కరువురోజులనుంచి తోచటంలేదనీ ఉత్తరం రాసింది. ఈ పిల్లాడి బారసాలప్పుడు మీఅన్నయ్య ఓముప్ఫై రూపాయిలు చదివించి ప్రస్తుతంలో అప్పుడు డబ్బులేక ఇవ్వలేదు నీకు గుర్తుందా? తరవాత నీకు మనియార్డరు చేస్తానన్నారు. ఈడబ్బు పంపిస్తే వాడి కోసం కర్చుపడక ఏసంసారపు కర్చుల్లోనో పడి వాడిగ్గాను వినియోగపడదు, ఎప్పుడయినా సమయ మొచ్చినప్పుడు ఇద్దాం లెండి ఉంచమన్నాను. అంచేత మీ అన్నయ్య ఆ డబ్బు పంపించలేదు అప్పట్నుంచీ. సీత ఆ ఉత్తరం రాయగానే నాకా డబ్బువిషయం చప్పున గుర్తొచ్చింది. ఆ ముప్ఫైయీ పెట్టి దానికోచీరా పిల్లాడికో చొక్కా కుట్టించి ఇంకో పదిరూపాయిలు పైనవేసి ఈ పేరంటం కర్చు జరిపాను. కాని మేం చేసిందల్లా ఏమిటంటే సాంతం పేరంటం అయ్యేదాకా నీకు చెప్పొద్దని అనుకున్నాము. కాని నీకు కర్చయిందల్లా ఏమిటంటే పేరంటాళ్లు వెళ్లిపోయిం తరువాత పోరుపెట్టి ఏడుస్తూంటే దాదాపు ఓ అర్ధసేర్నవటాకు ఎండుమిరపకాయలూ, అర్ధసేరు ఉప్పూ దిష్టి తీశాం అంతే" అన్నది ఫక్కుమని నవ్వుతూ.

ఈ మాటలన్నీ ఆశ్చర్యంగా నోరు తెరుచుకొని వింటూ "పోనీ వదినా ఆవార కాకపోయినా ఓ పదిరోజులకు సరిపోయే మిరపకాయలన్నా కర్చయినయ్యి కదా" అన్నాను ఎగతాళిగా.



జెమినీవారి "అపూర్వ సహోదరులు" చిత్రంలో శ్రీయుత యం. కె. రాధా. చిత్రంలో యిద్దరు సోదరుల పాత్రను యీ నటుడొక్కడే నిర్వహించాడు.